నవతెలంగాణ

1

ఆదిలాబాద్

సోమవారం | మార్చి 11, 2024 | www.navatelangana.com

కాలనీల అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-ఉట్నూర్



కాలనిల అభివృద్ధికి కృషి చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని శాంతినగర్ కాలనిలో పొద్దు పొడుపు-బొజ్జన్న అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టి కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. కాలనిలో ప్రధానంగా నీటీ, రోడ్డు, కరెంటుకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పలువురికి గాయాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్ మండలంలోని ఖండాల గ్రామ సమీపంలో ఆదివారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడటంతో పలువురు గాయలపాలయ్యారు. గాయపడిన వారిని వెంటనే జిల్లా రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, ముడుపు ప్రశాంత్‌రెడ్డి, పొచ్చిరామ్, సట్ల నాగన్న రిమ్స్‌కు వెళ్లి వారిని పరమర్శించి, వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు కోరారు.

అందరిదీ ఢిల్లీ బాట..!

- టికెట్ల కోసం అధిష్టానం వద్దకు పరుగులు
- కాంగ్రెస్, బీజేపీ ఆశావహులు అక్కడే మకాం
- పార్టీ ముఖ్యులను కలుస్తూ పైరవీలు
- ఆసక్తికరంగా మారుతున్న ఉమ్మడి జిల్లా రాజకీయం





లోక్‌సభ ఎన్నికలకు మరికొన్ని రోజుల్లో నోటిఫికేషన్ రానున్న తరుణంలో ఉమ్మడి జిల్లా రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీల టికెట్లు దక్కించుకునేందుకు అనేక మంది ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్లు ఆశిస్తున్న వారు తరుచూ ఢిల్లీ బాట పడుతున్నారు. ఆయా పార్టీల అధిష్టానం ముఖ్యులను ప్రసన్నం చేసుకునేందుకు పదరాని పాట్లు పడుతున్నారు. కొందరు ఆశావహులు రోజుల తరబడి దేశ రాజధానిలోనే ఉంటూ టికెట్ల కోసం ప్రయత్నాలు చేయగా.. మరికొందరు రెండు రోజులకు ఒకసారి ఢిల్లీ వెళ్తూ టికెట్ కేటాయించాలని వారి ఆసక్తిని తెలియజేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే ఈ రెండు పార్టీల అధిష్టానాలకు పలువురు ఆశావహులు టికెట్ల కోసం అర్జీ పెట్టుకున్నారు. కాంగ్రెస్ టికెట్ కోసం 22 మంది దరఖాస్తులు చేసుకోగా.. బీజేపీ టికెట్‌ను సుమారు పది మందికి పైగానే ఆశిస్తుండటం చర్చనీయాంశమవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల సమయం దగ్గర పడటంతో అందరి చూపు వీటిపైనే కేంద్రీకృతమైంది. ముఖ్యంగా ఆదిలాబాద్ లోక్‌సభ సీటు దక్కించుకోవడంపై ప్రధాన పార్టీలు దృష్టిసారించడంతో ఈ టికెట్‌పై అనేక మంది దృష్టిపెట్టారు. ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీల నుంచి ఎక్కువ మంది టికెట్ ఆశిస్తున్నారు. ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందనే ప్రచారం నేపథ్యంలో టికెట్ల కోసం ఆ పార్టీలకు చెందిన నేతలే కాకుండా పలువురు వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులు,పలు రంగాలకు చెందిన వారు కూడా ఎంపీ బరిలో నిలవాలని భావిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ అధిష్టానాల ముఖ్య నేతలకు విజ్ఞప్తులు చేశారు. ఇందులో కొందరు నాయకులు కొన్ని రోజుల నుంచి ఢిల్లీలోనే ఉంటూ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేయగా.. మరికొందరు ఉద్యోగులు, ఇతర రంగాలకు చెందిన వారు మాత్రం రెండు రోజులకు ఒకసారి వెళ్లి వస్తూ వారి పనిలో నిమగ్నమవుతున్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, రాష్ట్ర స్థాయి నాయకులతో సంప్రదింపులు చేయిస్తూ టికెట్ల కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

కొలిక్కి వచ్చిన కసరత్తు..?

ఈ నెల 12వ తేదీ తర్వాత ఏ క్షణమైనా లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడుతుందనే ప్రచారం జరుగుతోంది. దీంతో అభ్యర్థుల ఎంపికను కూడా ఈ రెండు పార్టీల అధిష్టాలు పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది. పదుల సంఖ్యలో ఆశావహులు ఉండటం అందులో ఎవరైతే విజయం సాధించేందుకు ఆస్కారం ఉంటుందనే కోణంలో అభ్యర్థిని ఎంపిక జరుగుతోందని తెలిసింది.

కాంగ్రెస్‌లో ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక ఓ కొలిక్కి వచ్చిందని.. చివరకు నలుగురు అభ్యర్థుల పేర్లను పరిగణలోకి తీసుకొని ఇందులో ఎవరైతే బాగుంటుందనే కోణంలో సమాలోచన చేస్తున్నట్లు తెలిసింది. మహబూబాబాద్ టికెట్‌ను లంబాడ సామాజిక వర్గానికి టికెట్ కేటాయించడంతో ఆదిలాబాద్ లోక్‌సభ టికెట్‌ను ఆదివాసీలకు కేటాయించనుందనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క బీజేపీ టికెట్ కోసమూ పలువురు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ పార్టీ తరపున సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ తాజాగా లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచేందుకు ఈ పార్టీ టికెట్‌ను అనేక మంది ఆశిస్తుండటం గమనార్హం. ఇప్పటికే ఒకరిద్దరు ఆశావహులు ప్రచారం సైతం నిర్వహించడం గమనార్హం. తాజాగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎంపీ గోడం నగేష్ బీజేపీ తీర్థం పుచ్చుకోవడం ఆసక్తికరంగా మారింది. ఆ పార్టీ టికెట్ హామీ ఏమైనా లభించిందా అనే చర్చ జరుగుతోంది. ఒకటి రెండు రోజుల్లోనే ఈ రెండు పార్టీల నుంచి లోక్‌సభ బరిలో నిలిచే అభ్యర్థుల పేర్లను ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-కుభీర్

తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించిన ముథోల్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 135 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాధిముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుభీర్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మండలన్ని అన్ని రంగాల్లో అబివృద్ధి పరుస్తానని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో మురికి కాలువలు సీసీ రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గంగా చరణ్, సౌంలి రమేష్, బోయిడి విఠల్, కొట్టే హనుమాండ్లు, తహసీల్దార్ ముంజం సోము పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకి భూమి పూజ

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని పాత ఉట్నూర్ ఐబీ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేని షాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ భీంరావ్ నాయక్, కారోబారి రవీందర్ పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం





నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా మహిళల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత, ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రణీత మాట్లాడుతూ తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, మహిళా ఉపాధ్యాయుల సమస్యలను సమస్యలను తన దృష్టికి ఎన్నోసార్లు తీసుకువచ్చారని వారు ప్రతిపాదించిన అన్ని పనులను వెంటనే చేపడతామని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం లోనే కాకుండా సమాజసేవలోను టీయూటీఎఫ్ సభ్యులు ముందు ఉంటారని కొనియాడారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కల్పన మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలో దూసుకుపోతున్నారని, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం ఉన్నందున మహిళలందరూ ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నప్పుడు వేతనాలు రాని సందర్భంలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చందాల ద్వారా సేకరించిన డబ్బులను ఆర్టీసీ కార్మికులకు అందజేసి కష్టకాలంలో ఆదుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు అంజనీదేవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుజాత, ఆదిలాబాద్ రూరల్ మండల జనరల్ సెక్రెటరీ అరుణ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌లో గోలేటి క్రీడాకారులు

నవతెలంగాణ-రెబ్బెన





జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు గోలేటికి చెందిన క్రీడాకారులు దత్తు గోపాల్, ఫిర్సింగుల సాయిచరణ్ ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10 నుంచి 14 వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే అండర్-19 బాలుర జూనియర్ జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు గోపాల్, సాయిచరణ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. క్రీడాకారులను ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నర్సింగం, సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, శపక్‌తక్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, తగ్‌ఆఫ్‌వార్ ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, షార్ప్‌స్టార్ బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్షుడు వి.మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, కోశాధికారి యు.శంకర్, కుమ్మరి మల్లేష్, ఆర్.రామకృష్ణ, ఎల్.హరిలాల్ అభినందనలు తెలిపారు.

పురుగులమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన డాంబరి బాపు(52) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబంలో మనస్పారుదలతో శనివారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మహిళలను సన్మానిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్మిక సంఘ భవనంలో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌తో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ రంగాల్లో పనిచేసే వయసు రిత్యా పని మానేసిన మహిళలకు, ప్రస్తుతం చేస్తున్న మహిళలకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు నేటితరంలో అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారని, ఇది ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. మహిళ అంటే సృష్టికి మూలమని అటువంటి మహిళలను తక్కువగా చూసే సమాజం ఎదగలేదన్నారు. ప్రతి ఒక్కరు మహిళలకు సరైన గౌరవం అందించాలని సూచించారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న మహిళా కార్మికులు ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కమలాకర్, జిల్లా కార్యదర్శి అశోక్, నాయకులు కమలాకర్, ఆనందరావు, సదయ్య, రవి, మహేష్, రాజన్న, అశోక్, నరేష్, సుభాష్, తిరుపతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మరోషాక్..!

- బీజేపీలో చేరిన మాజీ ఎంపీ గోడం నగేష్



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో ముఖ్య నాయకులు ఆ పార్టీని వీడటం చర్చనీయాంశమవుతోంది. ఇప్పటికే కొందరు కీలక నాయకులు పార్టీని వదిలివెళ్లిపోగా.. తాజాగా ఆ పార్టీకి చెందిన మాజీ ఎంపీ గోడం నగేష్ కాషాయ కండువా కప్పుకున్నారు. ఆదివారం ఢిల్లీలో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి తరుణ్‌చుగ్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అధిష్టానం నుంచి బీజేపీ టికెట్ హామీ లభించిందనే అనే ప్రచారం జోరుగా సాగుతోంది. కొన్ని రోజుల నుంచి నగేష్ బీజేపీలో చేరుతారనే ప్రచారం జరుగుతుండగా తాజాగా కాషాయ కండువా కప్పుకోవడం గమనార్హం. గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన ఆయన బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ప్రస్తుత ఎంపీ సోయం బాపురావు చేతిలో ఓడిపోయి రెండో స్థానంలో నిలిచారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బోథ్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్‌ను ఆశించారు. కానీ ఆ పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించకపోవడంతో కొద్ది రోజులుగా సైలెంట్‌గా ఉన్న ఆయన తాజాగా బీజేపీలో చేరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- స్పందించి ఆస్పత్రికి తరలించిన టాస్క్ ఫోర్స్ పోలీసులు



రోడ్డు ప్రమాదంలో గాయడిన శ్రీనివాస్, తపన్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆస్పత్రికి తరలించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. కాగజ్‌నగర్-డబ్బా ప్రధాన రహదారి కడంబా సమీపంలో ఆదివారం జరిగిన రహదారి ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... చింతలమానెపెల్లి మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన చాప్లె శ్రీనివాస్, రవీంద్రనగర్‌కు చెందిన తపన్ స్కూటీపై కాగజ్‌నగర్ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో శ్రీనివాస్, తపన్ తీవ్రంగా గాయపడ్డారు. ఇదే మార్గంలో వెళ న్న టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, పీసీలు వేముర్ల మధు, రమేష్, బాలరాజులు స్పందించి క్షతగాత్రులను వారి వాహనంలో కాగజ్‌నగర్‌కు తీసుకువచ్చి ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో గాయపడిన బాధితులను సకాలంలో ఆస్పత్రికి తరలించిన టాస్క్ ఫోర్స్ పోలీసులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్ష



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రుక్మాపూర్ సైనిక్ స్కూల్లో రానున్న విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆర్సీఓ కొప్పుల స్వరూపరాణి తనిఖీ చేసి మౌలిక వసతులు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు సలహాలు చేశారు. సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్, ప్రిన్సిపల్ శ్రీనాథ్ మాట్లాడుతూ సైనిక్ స్కూల్లో ఆరో తరగతి ప్రవేశాల కోసం 95 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 84 మంది రాశారని, 11మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఇంటర్మీడియట్ కోసం 60 మంది దరఖాస్తు చేసుకోగా 48 మంది హాజరయ్యారని, 12 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. 85 శాతం విద్యార్థుల హాజరు శాతం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఓ ఉపేందర్, అధ్యాపకులు మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాన్‌షాప్ నడిపిస్తూ ఉద్యోగం సాధించాడు

నవతెలంగాణ-నార్నూర్



మండల కేంద్రానికి చెందిన జాడే నరేందర్ పాన్‌షాప్ నడుపుతూ ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. డిగ్రీ చదివి ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి అనేక పోటీ పరీక్షలు రాసి ఉద్యోగం రాకపోయిన నిరాశ చెందకుండా కుటుంబ పోషన కోసం పాన్‌షాప్ నడిపిస్తున్నాడు. గత ప్రభుత్వం వేసిన గురుకుల నోటిఫికేషన్ లో దరఖాస్తు చేసుకుని పాన్ షాప్‌లో కూర్చుని సమయం దొరుకినప్పుడులా చదివి టీజీటీ ఉద్యోగం సాధించాడు. మండల కేంద్రానికి చెందిన జాడే నరేందర్‌ను ఆదివారం మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్‌తో పాటు పలువురు అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమని అన్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్య సాధనపై దష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యూనీస్ అక్బానీ, ఫ్యాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడే, ఎంపీటీసీ పరమేశ్వర్, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, దేవరావ్ లోకండే, కాంబ్లే బాలాజీ, మహేందర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2005 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు కొన్ని సంవత్సరాల తర్వాత ఒకే దగ్గర కలవడం ఎంతో సంతోషంగా ఉందని, విద్యార్థులు ఒకరికొకరు పరిచయం చేసుకుంటూ ప్రస్తుతం ఎవరు ఏం చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతియే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



పల్లె ప్రగతియే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని సమ్మక్క, పాఠగూడ, దొడంద గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి రూ.20లక్షల నిధులతో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతుందన్నారు. త్వరలోనే సీఎం స్థలం ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షల ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట జెడ్పీటీసీ అర్క పుష్పలత, నాయకులు ముకాడే ఉత్తం ఉన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

సోమవారం | మార్చి 11, 2024 | www.navatelangana.com

చలి వేంద్రాన్ని ప్రారంభించిన యూత్ సభ్యులు

నవతెలంగాణ-దస్తురాబాద్



మండలంలోని రేవోజిపేట గ్రామంలో ఆదివారం యూత్ సభ్యుల ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అను నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఈ చలి వేంద్రం వారి దాహార్తిని తీర్చుతుందని అన్నారు. చలి వేంద్రాన్ని ప్రారంభించడంతో పలువురు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గోపి, గోవర్ధన్, రమేష్, నాగన్న, చారి, మహేష్, సుమిత్, సుమన్, సత్తయ్య, ప్రశాంత్, రాకేష్, రాజన్న, శేఖర్ పాల్గొన్నారు.

పాఠశాలలేని గ్రామం.. విద్యకు నోచుకోని చిన్నారులు..!

- అందని ప్రభుత్వ విద్య, దాతల సాయంతోనే చదువులు

నేటి కంప్యూటర్ యుగంలో కూడ చదువు అందని ద్రాక్షగా మారింది. విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన చిన్నారులు తమ నిండు జీవితాలను ఉళ్లో ఆడుకుంటూ సమయాన్ని వృధా చేస్తు గడిపేస్తున్నారు. తరాలు మారిన తమ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేక చిన్నారులు విద్యకు నోచుకోకుండా చదువుకు దూరమవుతున్నారు. స్వచ్ఛంధ సంస్థలు, దాతలు ముందుకు వచ్చి చదువులు చేపితేనే తప్ప విద్యార్థులకు విద్య అందడం లేదు. అధికారులు, ప్రభుత్వాలు మారిన తమ గ్రామ స్థితిగతులు మారడం లేదని మండలంలోని కుంటగూడ గ్రామపంచాయతీ పరిధిలోని పాలవాగు గ్రామస్తులు వాపోతున్నారు.

నవతెలంగాణ-సిరికొండ

పాలవాగు గ్రామంలో 30 మంది చిన్నారులు ఉన్నారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాల లేక పోవడంతో చిన్నారులు ఆటలకే పరిమితమవుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మన ప్రాంత సమస్యలు పరిష్కారం కావడం లేదని రాష్ట్రాన్ని సాధించుకొని పది సంవత్సరాలు గడిచిన సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయంటే అతిశయోక్తి లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తిం చేస్తున్నారు.

దాతల సహకారంతోనే తాత్కాలికంగా పాఠశాల కొనసాగింపు...

గ్రామంలో చదువుకునే పిల్లలు ఉన్నారని గ్రహించి, అప్పటి పోలీస్‌శాఖ ఇచ్చోడ సీఐ కరుణాకర్, ఎస్సై శంకర్ నాయక్‌లు తమ సొంత డబ్బులతో పాఠశాల కోసం ఒక షెడ్డును ఏర్పాటు చేసి పిల్లలకు కావాల్సిన పుస్తకాలను, బ్యాగులను అందజేసి పాఠశాలను ప్రారంభించారు. తర్వాత వారు బదిలీపై వెళ్లడంతో మళ్లీ కథ మొదటికే వచ్చింది. కొన్ని రోజుల తర్వాత సిరికొండ మండల కేంద్రానికి చెందిన యువసేన సభ్యులు పాలవాగు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని పటేల్, గ్రామస్తులను కలిసి పిల్లలకు విద్యనందిస్తామని ముందు వచ్చారు. తమ సొంత డబ్బులతో గ్రామంలో డిగ్రీ చదివి నిరుద్యోగిగా ఉన్న యాదవ్ రావ్ అనే యువకుడిని విద్యా వాలంటర్‌గా నియమించి నెలకు కొంత డబ్బులను ఇస్తూ, పిల్లలకు కావాల్సిన బ్యాగులను, పుస్తకాలను, పలకలను అందజేసి, పాఠశాలను కొనసాగించారు. గత సంవత్సరం యువసేన సభ్యులు పాఠశాలను కొనసాగించిన తర్వాత ఈ సంవత్సరం మా గ్రామంలో పాఠశాలను ఎవరు పున : ప్రారంభిస్తారా అని ఎదురు చూస్తున్న గ్రామస్తులకు, ఆదివాసీ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాలను పున : ప్రారంభించారు. విద్యార్థులకు సామాగ్రిని అందజేసి, ఒక విద్య వాలంటర్‌ను నియమించి, పాఠశాలను ప్రారంభించారు. ఇలా ప్రతి సంవత్సరం ఎవరో ఒకరు ఎదురుచూడటమేనా అని, మా గ్రామంలో ఒక ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసి, విద్యార్థులకు విద్యను అందించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.





అధికారులు చొరవ తీసుకోవాలి

మా గ్రామంలో 30 మంది పిల్లలు విద్యకు నోచుకోవడం లేదు. ప్రతి సంవత్సరం ఎవరో ఒకరు దాతలు ముందుకు వచ్చి గ్రామంలో పాఠశాలను కొనసాగిస్తున్నారు. గత సంవత్సరం యువసేన సభ్యులు పాఠశాలను ప్రారంభించారనే విషయాన్ని తెలుసుకుని అధికారులు మా గ్రామంలో పర్యటించి, ఒక విద్యా వాలంటర్‌ను నియమించి ప్రభుత్వం నుండే పాఠశాల కొనసాగేలా చూస్తామని అధికారులు చెప్పి వెళ్లారు. కానీ పాఠశాల ప్రారంభం కాలేదు. ఈ సంవత్సరం ఆదివాసీ సొసైటీ సభ్యులు పాఠశాలను పున : ప్రారంభించారు. అధికారులు ఇప్పటికైనా పాఠశాలను ప్రారంభించేలా చూడాలి.



భీంరావు గ్రామపటేల్

దాతల కోసం ప్రతి సంవత్సరం ఎదురు చూస్తున్నాం

గ్రామంలోని పిల్లలకు విద్యను ఎవరు అందిస్తారో అని ప్రతి సంవత్సరం ఎదురు చూడాల్సి వస్తోంది. గత సంవత్సరం యువసేన సభ్యుల సహకారంతో పాఠశాలను ప్రారంభించారు. ఈ సంవత్సరం ఆదివాసీ సొసైటీ సభ్యులు ప్రారంభించారు. ఇలా ప్రతి సంవత్సరం ఎవరో ఒకరు వచ్చి పాఠశాలను ప్రారంభిస్తారో అని ఎదురు చూడాల్సి వస్తుంది. అధికారులు, పాలకులు స్పందించి శాశ్వత పరిష్కారం అయ్యేలా ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించేలా చూడాలి.



యాదవ్‌రావ్ పాలవాగు యువకుడు

పార్లమెంట్ అభ్యర్థిగా ఆదరిస్తే అభివృద్ధి చేస్తా



నవతెలంగాణ-సిరికొండ

ఆదిలాబాద్ పార్లమెంట్ మహిళ అభ్యర్థిగా ఆదరిస్తే అభివృద్ధి చేస్తానని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఆశావాహ అభ్యర్థి సుగుణక్క అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులతో, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యురాలిగా మొదటి మహిళ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని అన్నారు. ఆదరిస్తే జిల్లాను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇమామ్, నాయకులు ప్రవీణ్, మాధవ్ పటేల్, రామరావ్, సాజిద్, హరిత పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పురుగులమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అంకోలి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకోలి గ్రామానికి చెందిన భీమనవేణి మల్లన్న(54) ఆర్థిక పరిస్థితి బాగాలేక పురుగులమందు తాగి ఆత్మహత్య పాల్పడ్డాడు. పురుగులమందు తాగి పడిపోవడంతో అపస్మారక స్థితిలో పడిఉన్న ఆయన్ను కుటుంబీకులు ఆటోలో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్సై ముజాహిద్ తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బోథ్ వాసికి జ్యోతిష్య బ్రహ్మ అవార్డు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన బిట్లింగు ముత్తన్న డాక్టర్ పీహెచ్‌డీ మెడికల్ ఎడ్యుకేషన్‌ను జ్యోతిష్యం బ్రహ్మ అవార్డు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ఎస్ఎస్ ఆస్ట్రాలజీ హైదరాబాద్ ఫౌండర్ డాక్టర్ నరసింహ స్వామి, ప్రొఫెసర్ సీవీ.సాంబశివరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పొచ్చెర గ్రామానికి చెందిన వాసికి అవార్డు దక్కినందుకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

గోదావరి నదికి ప్రత్యేక పూజలు

- పట్నాలు వేసి జల పిల్లలు వదిలిన భక్తులు

నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాల జాతరకు తరలివచ్చిన భక్తులు ఆదివారం వేలాల శివారు గోదావరి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాల జాతర మరుసటి రోజు గోదావరి నదిలో గంగమ్మతల్లికి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా తమతో పాటు తెచ్చుకున్న గొర్రె పిల్లలను జల పిల్లల పేరుతో గోదావరి నదిలో వదిలారు. వివిధ జిల్లాలకు చెందిన యాదవ కుటుంబాల వారు వేలాల మల్లన్నను దర్శించుకున్న మరునాడు కుటుంబ సభ్యులతో కలిసి గంగాదేవి పట్నాలు ఘనంగా నిర్వహించుకుంటారు. వందలాది కుటుంబాలు సామూహికంగా నిర్వహించుకున్న గంగాదేవి పట్నాలతో నదీ తీరంలో సందడి వాతావరణం సంతరించుకుంది. పూర్వీకుల నుండి గంగాదేవి పట్నాలను ఆనవాయితిగా జరుపుకుంటున్నామని ఈ పండుగతో తమ గొర్రె మందలు, పాడి పంటలు వృద్ధి చెందుతాయని వారు పేర్కొంటున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో పాఠశాల విద్య కుంటుపడిందని, నూతన ప్రభుత్వం విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని ఏబీఆర్ఎస్ఎం తెలంగాణ ప్రభారి పాలేటి వెంకట్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ లోని మాధవ నిలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీఆర్ఎస్ఎం తెలంగాణ ప్రభారి పాలేటి వెంకట్‌రావు మాట్లాడుతూ పదేండ్లుగా ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. పదోన్నతులు, పెండింగ్ డీఏలు విడుదల కాకపోవడంతో కష్టలు పడ్డారని తెలిపారు. పాఠశాల విద్య కూడా కుంటుపడిందన్నారు. నూతన ప్రభుత్వం గతంలో సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిందని, ఇప్పుడు దాన్ని పూర్తి చేయాలన్నారు. అదే విధంగా పదోన్నతులు పొంది విడుదల కానీ ఉపాధ్యాయులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపీఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. 317 జీఓ బాధితులకు తక్షణను న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 51శాతం ఫిటిమెంటిలో నూతన పీఆర్సీ ప్రకటించాలన్నారు. ప్రతి పాఠశాలకు ఉచిత విద్యుత్ సౌకర్యంతో పాటు స్కావెంజర్‌ని నియమించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చవాన్, వలబోజు గోపీకృష్ణ, ఆర్థిక కార్యదర్శి నారాయణ, జిల్లా నాయకులు గోమంత్ రెడ్డి, సింగిడి వెంకట రాంరెడ్డి, బత్తుల గంగాధర్, జయరాజ్ కుమార్, దేవ్‌రావ్, కేశవ్‌రావ్, వసంత్‌రావ్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సావిత్రిబాయి పూలే ఆశయాలను నేటి యువత కొనసాగించాలని మాల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. ఆదివారం మాల సంక్షేమ సంఘ భవనంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ఆయా రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోని మాల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు అర్క రమేష్, సిరిగిరి సాయి, ఏల్పుల కిరణ్‌కుమార్, గూకుంటి క్రాంతి కుమార్, చిలుక అరుణ్, నిమ్మల ప్రశాంత్, నిమ్మల కృపవరం, వరప్రసాద్ పాల్గొన్నారు.

తాంసి : మహాత్మ సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతిని ఆదివారం తాంసి మండల కేంద్రంతో పాటు కప్పర్ల, గిరిగాం, గ్రామాల్లో మాలీ కుల సంఘం సభ్యులు యువజన సంఘ సభ్యులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు స్వప్న రత్నా ప్రకాష్, గజానన్, మాజీ ఎంపీటీసీ గంగారాం, మాలీ కుల సంఘ, యువజన సంఘం సభ్యులు దీపక్, ప్రవీణ్, దశరథ్, పెంటన్న, పోచ్చన్న, రాములు, అనిల్, తులసిరాం, అశోక్ ఉన్నారు.

బోథ్ : మండల కేంద్రంతో పాటు సొనాల గ్రామంలోని ఆదివారం పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చదువుల తల్లి సావిత్రిబాయి పూలే ఎన్నో పాఠశాలలు ఏర్పాటు చేసి సబ్బండా వర్గాలకు విద్యను అందించారని అన్నారు. దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా మారి మహిళలకు చదువులు అందించిన మాతృమూర్తిని ఆదర్శంగా తీసుకొవాలని అన్నారు. కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంగారెడ్డి, పూలే వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గాజుల పోతన్న, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షులు తుమ్మ శ్రీధర్, కార్యదర్శులు విజయ్, భాస్కర్ రెడ్డి, కసిరే పోతన్న, నాయకులు అమృతరావు పాటిల్, సంఘపాల్, జక్కుల రవి, చెట్లపెల్లి అనిల్, సదానందం, అబుధ్, బలరాం పాల్గొన్నారు.



బోథ్



తాంసి

ఒంటికాలుపై నిలబడి సాధన కమిటీ నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ప్రజల చిరకాల వాంఛ అయిన ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ చేపట్టాలని రైల్వేలైన్ సాధన సమితి చైర్మెన్ సిర్ర దేవేందర్ అన్నారు. ఆర్ అండ్ బి ఎదుట చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 55వ రోజుకు చేరుకోగా ఒంటి కాలు మీద నిలబడి కేంద్రం తీరును ఎండట్టారు. గత 55 రోజులుగా అర్మూర్ రైల్వేలైన్ కోసం రిలే దీక్షలు కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోడం లేదని ఆరోపించారు. ఆదిలాబాద్‌లో మోడీ పర్యటన అందరిని నిరాశ పర్చిందన్నారు. ఒక హామీ ఇవ్వకుండా వెళ్లిపోయారని అన్నారు. ఆదిలాబాద్‌లో పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు మెస్రం భాస్కర్, రామాంజనేయులు, రాములు, రఫిక్, డా.లక్ష్మణ్, ఎండి ముజీబ్, వెంకటేష్, ఎండి ఖాసీం, రమేష్ పాల్గొన్నారు.



గిరి బిడ్డలకు అందని పౌష్టికాహారం

- సరఫరా కాని గ్యాస్
- అందని పాలు, పప్పులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిబిడ్డలకు పౌష్టికాహారం అందని ద్రాక్షలా మారింది. గిరిజన, ఆదివాసుల్లోని రక్త హీనత నుంచి కాపాడేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గిరిబిడ్డలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. అందులో భాగంగానే చిన్నపిల్లలోని పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు అంగన్‌వాడీల ద్వారా పాలు, గుడ్లు, కందిపప్పు పౌష్టికాహారాన్ని వండి పెట్టాల్సి ఉండగా గ్యాస్ సిలిండర్‌లు రాకపోవడంతో వారికి పౌష్టికాహారాన్ని అందించలేకపోతున్నాయి. చిన్నారుల్లో ఉన్న రక్తహీనతను నుంచి కాపాడేందుకు ప్రభుత్వం బలమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందజేస్తోంది. కాని అవేవి గత రెండు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు చేరడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు, గత రెండు నెలలుగా, కంది పప్పు నాలుగు నెలల నుంచి పంపిణీ కావడం లేదని, పలువురు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా వంటకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్ సైతం సప్లై కాకపోవడంతో పిల్లలు పస్తులుంటున్నారు. మండలంలోని కేస్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మొత్తం 47 మంది చిన్నారులతో పాటు 12 మంది గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పాలతో పాటు ఒక పూట పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాల్సి ఉంది. అయితే ఇక్కడ గత రెండు నెలలుగా పాలు, కంది పప్పు నాలుగు నెలల నుంచి రావడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత సెప్టెంబర్ నెలలో నుంచి కూరగాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇక ప్రస్తుతం తమ సెంటర్‌కు గ్యాస్ సిలిండర్ సైతం ఇవ్వక పోవడంతో పిల్లలకు వంట చేయలేదని, దీంతో పిల్లలు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

మండలంలో మొత్తం అవాస కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఇంద్రవెల్లి పరిధిలో మొత్తం 27 కేంద్రాలు, కేస్లాపూర్ పరిధిలో 26 కేంద్రాలు, ముత్నూర్ పరిధిలో 23 కేంద్రాలు, వాడ్‌గావ్ పరిధిలో 24 కేంద్రాలు పనిచేస్తున్నాయి. పైకేంద్రాల్లో మొత్తం 274 గర్భిణీలు, 456 బాలింతలకు ప్రతి రోజు పాలు, గుడ్లుతో పాటు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి. అదే విధంగా 3 సంవత్సరాల్లోపు పిల్లలు 1739 మంది, 3-6 సంవత్సరాల్లోపు మొత్తం 1,517 పిల్లలు ఉన్నారు. వీరికి ప్రతి రోజు ఆటల పాటలతో పాటు విద్యను అందిస్తున్నారు. అయితే పౌష్టికాహారం విషయంలో మాత్రం ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల పౌష్టికాహారానికి దూరంగా ఉంటున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

నెల నెల పంపిణీ కాని సరుకులు...

అంగనవాడీ కేంద్రాలకు ప్రతి నెల అవసరమయ్యే సరుకులు గుడ్లు తప్ప ఇతర ముఖ్య సరుకులైన పాలు, కంది పప్పు, సప్లై కావడం లేదు. దీంతో వర్కర్లే తమకు పరిచయమున్న కిరాణా షాపుల్లో అప్పులు చేసి సెంటర్లు నడుపుతున్నారు. వీరికి గత సెప్టెంబర్ నెల నుంచి కూరగాయలు, ఇతర నూనె వస్తువుల బిల్లులు చెల్లించలేదు. ఇన్ని రోజులుగా తమ వేతనాల నుంచే అప్పుగా చేసి, సరుకులు కొని పెట్టామన్నారు. సరుకుల బిల్లులు రావడం లేదన్నారు. చాలిచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న తమకు బిల్లులు రాక పోవడంతో అప్పుల బారిన పడ్డామని తమ బాధలు వ్యక్తం చేశారు.



అందని గ్యాస్ సిలిండర్‌లు...

అంగన్‌వాడీ కేంద్రాలకు గ్యాస్ సిలిండర్ కావాలంటే బొటన వేలు పెట్టాలని నిబంధనలు పెట్టడంతో అది సప్లై కావడం లేదు. దీంతో వంటకు అవసరమైన పప్పులు సప్లై లేదు, బిల్లులు రాక అప్పుల పాలు అయ్యాం. దీంతో గత్యంతరం లేక పిల్లలకు, గర్భిణీలు, బాలింతలకు ఒక పూట భోజనం పెట్టలేక పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొందని అంగన్వాడీ వర్కర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి, సరుకులు, గ్యాస్ సిలిండర్‌లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

నియోజకవర్గ ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలందించేలా చర్యలు చేపడతానని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. ఆదివారం మండలంలోని చింతగూడ, చారిగాం, వంజిరి, భట్టుపల్లి గ్రామాల్లో జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సబ్ సెంటర్ల భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సబ్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం తరపున వైద్యులు, వైద్య సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని రౌట సంకపల్లి గ్రామంలో పర్సనంభాల, బారేగూడలో ఆదివారం ఆసిఫాబాద్ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు గంధం శ్రీనివాస్, నాయకులు సంతోష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఆర్టీసీ కార్మికుల ఫ్రెండ్లీ ప్రభుత్వం కాంగ్రెస్

- నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటూ ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ముందుకు సాగుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ అన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం 21 శాతం ఫిట్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు ఆర్టీసీ కార్మికులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాట ప్రకారం ఆర్టీసీ కార్మికులకు 21 శాతం ఫిట్మెంట్ ప్రకటించి ఫ్రెండ్లీ ప్రభుత్వంగా నిలిచిందన్నారు. గతంతో పోలిస్తే మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తర్వాత ఆర్టీసీని వినియోగించుకునే వారి సంఖ్య పెరిగిందన్నారు. వారందరికీ నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వంద రోజుల పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు పూర్తి చేసిందని, ఇది ఒక చారిత్రాత్మక గెలుపు అన్నారు. గత పాలకులు ఆర్టీసీని పట్టించుకోలేదని, 40 మంది చావులకు కారణమైందని ఆరోపించారు. జాతీయ సమగ్రతకు ఆర్టీసీ ఎంతగానో కృషి చేస్తుందని, సొసైటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మంగ, చరణ్, ఆసిఫ్, రాపర్తి మురళీ, మునీర్, దత్తు, రామచందర్, శశి, మల్లికార్జున్, బీసీ సంఘం నాయకుడు మారుతి పటేల్, మాలీ సంఘం నాయకుడు శంకర్, ఈయూ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేష్, టీజేఎంయూ డిపో సెక్రెటరీ గుండా శ్రీనివాస్, సీసీఎస్ డెలికేట్ కల్లూరి హనుమంత్, ఆర్టీసీ కార్మికులు నరేష్, ఆర్పి సింగ్, రవి, వెంకటేశ్వర్, ముజఫర్ హుస్సేన్, సత్యనారాయణ, జంగంపల్లి విక్రమ్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వైద్యులను నియమించాలి

- ఎంపీపీ పెందూర్ మోతీరాం



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యులను నియమించాలని ఎంపీపీ పెందూర్ మోతీరాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఏఎన్ఎం ఒక్కరే విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. రోజు వారీ ఓపి సేవలు అందించడానికి సిబ్బంది లేక పేద ప్రజలకు వైద్యం అందడం లేదన్నారు. ఇద్దరు వైద్యులు ఉండాల్సిన ఆస్పత్రిలో ఒక్క డాక్టర్ కూడా లేడని తెలిపారు. మండలంలోని అనేక గ్రామాల ప్రజలు ప్రభుత్వ వైద్యంపై ఆధార పడుతున్నారని, వైద్యులు లేకుండా పేద ప్రజలకు వైద్యం ఏవిధంగా అందుతుందని ప్రశ్నించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆస్పత్రిని సందర్శించిన వైద్యులను సర్దుబాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులతో పాటు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-దహెగాం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని గొర్రెగుట్ట కొత్మీర్ గ్రామాల్లో రూ.36 లక్షల ఉపాధి హామి నిధులతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల్లో మౌళిక వసతుల కల్పన కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. అనేక సంక్షేమ పథకాలను సైతం ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. రాబోవు రోజుల్లో కూడా అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాపర్తి దనుంజయ, కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోళం వెంకటేష్, నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు వలపదాసు రమేష్, సింగిల్ విండో చైర్మన్ కొండ్ర తిరుపతి గౌడ్, సామెర మల్లేష్, పడాల సురేష్, నాయికిని మల్లేష్, సత్యనారాయణ, బొలిశెట్టి మహేష్, సిద్ధం వెంకటేశం, వెన్నంపల్లి సుధాకర్, మతిన్, బాషు, నిజాం పాల్గొన్నారు.

ముగిసిన భద్రకాళీ జాతర

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల నుండి కొనసాగుతున్న జాతర ఆదివారంతో ముగిసింది. ఆదివారం ఉదయం వీరఖడ్గంతో ఆలయ పూజారులు ప్రబలు నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు భద్రకాళీ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండం నుండి భక్తులు నడిచివెళ్లి వారి మొక్కులను చెల్లించుకున్నారు. ఎస్ఐ కొమురయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నిలువ నీడలేక.. ప్రయాణికుల అవస్థలు

- చెట్లు, దుకాణాలను ఆశ్రయిస్తున్న జనం
- స్థలాలున్నా నిర్మించని పాలకులు, ఆర్టీసీ సంస్థ
- నూతన ప్రభుత్వంలోనైన బస్టాండ్ల నిర్మాణం అయ్యేనా..?

ఒక పక్క ఎండలు.. మరో పక్క వర్షాలు.. ప్రయాణీకులకు అవస్థలు కలిగిస్తున్నాయి. ఎందుకంటే బస్సు కోసం ఎదురు చూడటానికి చాలాచోట్ల బస్ షెల్టర్లు లేవు. నిలువ నీడ లేక చెట్లను, దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. జంక్షన్‌లో బస్సుల కోసం నిరీక్షించే సమయంలో ఎండ మండినా, వాన వచ్చినా తలదాచుకోవడానికి పరుగులు తీయాల్సిన దుస్థితి. ఇటు పాలకులు, అటూ ఆర్టీసీ పట్టించుకోవపోవడంతో ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. మండల కేంద్రాల్లో కూడా షెల్టర్లు లేక జనాలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలో కూడా బస్టాండ్ లేక అవస్థలు తప్పడం లేదు. కొన్ని చోట్ల స్థలాలున్నా పాలకులు, ఆర్టీసీ సంస్థ నిర్లక్ష్యం కారణంగా నిర్మాణాలు కావడం లేదు. ఈ నూతన ప్రభుత్వంలోనైనా తమ సమస్యకు పరిష్కరం లభిస్తుందనే ఆశతో జనాలున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని షెల్టర్లు లేని మండల కేంద్రాల గురించి 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం...



సిర్పూర్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలోని మొట్టమొదటి అసెంబ్లీ స్థానం. కానీ అభివృద్ధిలో మాత్రం చివరి స్థానం. దీనికి నిదర్శనమే సిర్పూర్ మండలంలోని సౌకర్యవంతమైన బస్టాండు లేకపోవడమే. సిర్పూర్‌కు సరిహద్దుగా మహారాష్ట్ర ఉండడం, అలాగే నియోజకవర్గంలో బెజ్జూరు, చింతలమానెపెల్లి, కౌటాల మండలాలకు కూడా బస్సులు ఈ దారినే రాకపోకలు కొనసాగిస్తుంటాయి. గ్రామాల నుండి వచ్చే విద్యార్థులు, ప్రజలతో సిర్పూర్ మండల కేంద్రం రద్దీగా ఉంటుంది. అయితే సౌకర్యవంతమైన బస్టాండు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండు నిర్మించాలని పలు దఫాలుగా అధికారులకు, నాయకులకు మొరపెట్టుకున్న సంఘటనలున్నాయి. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే బస్టాండు నిర్మాణం కోసం చొరవ చూపలేదు. ఇప్పటికైనా నూతనంగా రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు నియోజకవర్గంలో మొట్టమొదటి సారిగా బీజేపీ యువ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు పూర్తి మద్దతిచ్చి గెలిపించారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని సిర్పూర్ మండల ప్రజల కష్టాలను చూసి మండలంలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన బస్టాండు సౌకర్యం కల్పించడానికి అసెంబ్లీలో గలమెత్తాలని ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది

ఇష్ఫత్ హుస్సేన్, గ్రామస్తుడు



కుటుంబంతో ప్రయాణం చేయాల్సి వస్తే నరకమే కనబడుతుంది. మహిళలు, విద్యార్థినీలు రోడ్డుపై నిలబడి ప్రయాణాలు చేస్తుంటే చాలా బాధ అనిపిస్తుంది. ప్రస్తుతం నిర్మించిన రేకుల షెడ్డు బస్టాండుకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంది. ఈ మార్గంలో బస్సులు ఏ సమయంలో వస్తాయో తెలియదు. గంటల తరబడి ప్రయాణికులు హోటళ్లు, దుకాణాల్లో రేకుల షెడ్డు క్రింద వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ప్రయాణాన్ని రద్దు చేసుకున్న సందర్భాలున్నాయి.

బస్టాండు పక్కా భవనం నిర్మించాలి

దోంగ్రె మాణిక్, దోర్‌పెల్లి గ్రామం



బస్టాండుకు పక్కా భవనం నిర్మించాలి. మండలకేంద్రంలో బస్టాండు లేదని గతంలో మంత్రులకు, అధికారులకు మొరపెట్టుకోగా రేకుల షెడ్డు నిర్మించి చేతులు దులుపుకున్నారు. తాత్కాలికంగా నిర్మించిన బస్టాండులో ఏ ఒక్క ఆర్టీసీ అధికారి ఉండారు. బస్సులు ఎప్పుడు వస్తాయో అని చెప్పే వారు ఉండారు. దీంతో పాత స్థలంలోనే ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి సౌకర్యవంతంగా ఉండే బస్టాండును నిర్మించాలి.

(నవతెలంగాణ-సిర్పూర్(టి))



జైనూర్‌లో బస్ షెల్టర్ లేక రోడ్డుపైనే ఉన్న వెచిచూస్తున్న ప్రయాణీకులు



మండలకేంద్రంలో ప్రయాణ ప్రాంగణం లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 సంవత్సరాల క్రితం నిధులు మంజూరు చేసినప్పటికీ బస్టాండు నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రయాణికులు హోటళ్లు, కిరాణ దుకాణాల ముందు నిల్చొవాల్సిన పరిస్థితి నెలకొంది. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో ఎండను తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్ కోసం రోడ్డు వద్దనే వేచిచూడాల్సిన పరిస్థితి. మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో మహిళలు కాలకృత్యాలను తిర్చుకోవడానికిఇబ్బందులు పడాల్సి వస్తుంది. నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బస్టాండు నిర్మాణం కోసం భూమిపూజ చేసినప్పటికీ నిర్మాణం చేపట్టకపోవడంతో బస్టాండు కల మండల ప్రజలకు నేటికి నెరవేరడంలేదు. బస్టాండు కోసం కేటాయించిన స్థలం అన్యాక్రాంతం అవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలుయి.

బస్టాండు నిర్మాణం చేపట్టాలి...

శ్యాంరావ్, సలుగుపల్లి



బస్టాండు లేక ఇబ్బందులు పడుతున్నాం. బస్టాండు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి. బస్ కోసం ఎండలో రోడ్డు వద్ద నిల్చొవాల్సిన పరిస్థితి. ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోతున్నాం. బస్టాండును వెంటనే మంజూరు చేసి నిర్మించాలి.

అన్ని కాలాల్లో ఇబ్బంది పడుతున్నాం

పురుషోత్తం, సిద్ధాపూర్



బస్టాండు లేక వర్షాకాలంలో వానకు తడుస్తున్నాం. ఎండకాలంలో ఎండకు ఇబ్బంది పడుతున్నాం. బస్టాండు నిర్మించాలి. ఎన్ని ప్రభుత్వాలు మారిన మండలకేంద్రంలో బస్టాండు నిర్మించడంలేదు. దూరం నుండి వచ్చే ప్రయాణికులకు మరుగుదొడ్డి సమస్య తీవ్రంగా ఉంది. వెంటనే బస్టాండు నిర్మించి మరుగుదొడ్లను ఏర్పాటుచేయాలి.

(నవతెలంగాణ-బెజ్జూరు)



నిత్యం వందలాది మందిప్రజలు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తున్నారు. కాలమేదైనాసరే రోడ్లపైనే బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు. వర్షానికి తడుస్తూ, చలికి వణుకుతూ ఎండాకాలం కాలమైతే మరింత దారుణంగా ఉంటుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారిన మండల కేంద్రంలో బస్ షెల్టర్ నిర్మాణంపై దృష్టి సారించక పోవడంతో నేటికి బస్‌షెల్టర్ నిర్మాణం కార్యరూపం దాల్చక కలగానే మిగిలింది. షెల్టర్ లేని కారణంగా ప్రయాణికులకు కిరాణా దుకాణాలు, హోటళ్లు, చెట్లే ఆధారం అవుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా టాయిలెట్ల సౌకర్యం లేక మహిళా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు ఎండలోనే నిరీక్షించాల్సి వస్తోంది. ప్రక్కనే ఉన్నా అసిఫాబాద్ జిల్లా కేంద్రంలో విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్, నిత్యావసర వస్తువులకు మండల కేంద్రం నుండి వందలాది మంది ఇక్కడి నుండే బస్సు ఎక్కాలి. ఆర్టీసీ బస్సుల కోసం రోడ్డుపైనే నిలబడాలి. కెరమెరి నుండి ఉట్నూర్ ఆదిలాబాద్, నిర్మల్, అసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల వెళ్లేందుకు వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉంటారు. బస్సుల కోసం గంటల కొద్దీ ఎర్రటి ఎండలో రోడ్డుపక్కనే వేచి ఉండాల్సి వస్తోంది. కొద్దిపాటి వర్షం కురిసినా తలదాచుకునేందుకు చోటు లేక లగేజీలు, పిల్లాపాపలతో తడవాల్సి వస్తోంది.ప్రధానంగా ఈ ప్రాంతంలో మరుగుదొడ్డి సౌకర్యం లేక బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులు, బస్సు దిగిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎవరు పట్టించుకోవడం లేదు

సతీష్ గౌడ్, కెరమెరి



బస్ షెల్టర్ నిర్మాణానికి 2016లో ఆర్టీసీ అధికారులు మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ స్థలాన్ని పరిశీలించారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత షెల్టర్ నిర్మాణానికి ఎలాంటి పనులు ముందుకు సాగక పోవడంతో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయింది.

బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టాలి

పెందూర్ ఆనంద్ రావు, సాకడ గ్రామస్తుడు



మండల కేంద్రంలో బస్ షెల్టర్ నిర్మాణం చేపడితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఎండాకాలం కావడంతో బస్సుల కోసం ఎండలో నిల్చోని ఎదురు చూడాల్సి వస్తుంది. విద్యార్థులు, మహిళలు, వృద్దులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం బస్ షెల్టర్ నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మాణం పూర్తి చేయాలి.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా

సిద్దికి ద్రుపతబాయి, జెడ్పీటీసీ సభ్యురాలు



బస్ షెల్టర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కావడంతో ప్రజలు చెట్ల కింద తలదాచుకుంటున్నారు. ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్‌షెల్టర్ అవసరాన్ని వివరిస్తాను. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే సర్వసభ్య సమావేశంలోనూ సమస్యపై ఉన్నత అధికారులకు విన్నవిస్తాం.

(నవతెలంగాణ-కెరమెరి)

అనగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి ఫూలే



నవతెలంగాణ-కెరమెరి

అనగారి నా వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే అని, ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరముందని మాలీ సంఘం మండల అధ్యక్షుడు కావుడే తులసి రాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మాలీ సంఘం భవనంలో సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయురాలుగా ప్రముఖ సంఘసంస్కర్తగా అణగారిన జాతుల అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప నాయకురాలని పేర్కొన్నారు. మహిళ విద్యాభివృద్ధి కోసం ఎన్నో పాఠశాలలను స్థాపించి మహిళలకు చదువు నేర్పించిన మొట్టమొదటి ఉపాధ్యాయురాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆదే శ్యాంరావు, సెండే నారాయణ, తిరుపతి, వాడై దేవేందర్ పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. సావిత్రిబాయి వర్ధంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించి ఘన నివాళులర్పించారు. జీవితాంతం సమాజం కోసం మహిళా విద్యాభివృద్ధి కోసం ఎన్నో పోరాటాలు చేశారని పేర్కొన్నారు. నేటి కాలం మహిళలు సావిత్రిబాయి పూలను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, లక్ష్మణ్, సందీప్, హనుమంతు, దేవేందర్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని కోసినిలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని బీఎస్పీ, సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలిగా, సంఘసంస్కర్తగా అణగారిన జాతుల అభ్యున్నతికై అలుపెరుగని పోరాటం చేసి మహిళా విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు కలికోట రమణయ్య నారాయణ మూర్తి, బి.నర్సయ్య పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండలంలోని డబ్బా, బారెగుడ, రుద్రాపూర్, బూరెపల్లితో పాటు ఆయా గ్రామాల్లో జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి విగ్రహాలకు పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాలీ సంఘం నాయకులు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతీయ సంఘసంస్కర్త, ఉపాధ్యాయురాలు, రచయిత్రి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం మండల అధ్యక్షులు నికోడే బాపురావు, గ్రామ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్, గ్రామస్తులు జయంత్, గణపతి, యువజన సంఘం అధ్యక్షులు గణపతి, ఉపాధ్యక్షుడు బాపురావు, శ్రీనివాస్, దేవాదాస్, జన్నాజి పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : భారతదేశ మొట్టమొదటి బడుగు బలహీన వర్గాలకు విద్యనందించిన వ్యక్తి, సమసమాజం నిర్మాణం కోసం ఆమె జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప పోరాట యోధురాలు సావిత్రీబాయి అని మాలీ సంఘం మండల అధ్యక్షుడు గుర్నులే నానాజీ అన్నారు. ఆదివారం సావిత్రీబాయి పూలే 127వ వర్ధంతిని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సావిత్రీబాయి పూలే అని, ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు మహనీయుల అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం ఉపాధ్యక్షుడు లెండుగురె శంకర్, మోర్లె బాలాజీ, ప్రధాన కార్యదర్శి వడాయి రవి, నాయకులు వడాయి ఇస్తారి, గుర్నులే గణపతి, శ్రీనివాస్, వడాయి పురుషోత్తం, భీంరావు, వెంకటి, మానెపెల్లి ప్రభాకర్, మౌల్కార్ లలిత పాల్గొన్నారు.





రంజాన్ మాసంలో మినహాయింపులు ఇవ్వాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈ నెల 12వ తేదీ నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీసులు కొన్ని మినహా యింపులు ఇవ్వాలని ముస్లిం యువకులు పోలీస్‌స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, చలాన్ల విషయంలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. రాత్రి సమయంలో టీ స్టాల్‌లకు, హోటల్‌లు నడుపుకొనడానికి అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు నాయకులు మొహమ్మద్ షఫీ, అర్షద్, బాలు, వెంకటేష్ అబ్బు హష్మీ, ఆయాన్, తమిమ్, అద్నన్, సమీర్, అహ్మద్, అమ్ములాల్, అర్బాజ్, అతిక్, కైఫ్, అర్బాజ్, దస్తగిర్ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్‌ను పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-మందమర్రి



ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను మందమర్రి పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం రెబ్బెన నుంచి జగిత్యాల వెళ్తున్న టీఎస్ 21టి 9992 నెంబర్ గల టిప్పర్‌ను అందుగుల పేట ఫ్లై ఓవర్ వద్ద ఆపి తనిఖీ చేయగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్ గాజుల విజయ్ గౌడ్‌ను ప్రశ్నించగా నేరాన్ని ఒప్పుకొని, రెబ్బెనకు చెందిన నార్ల శ్రీనివాస్ వ్యక్తి దగ్గర నుంచి జగిత్యాలకు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. సంబంధిత పత్రాలు లేకపోవడంతో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కాల్చవద్దు.. కలియదున్ను..!

- వ్యర్థంకాదు..పంటల సాగుకు వెన్నుదున్ను

నవతెలంగాణ-జైపూర్





పంటల సాగులో ధాన్యం మినహా మిగితాది పశుగ్రాసంగా పనికొస్తుంది. వద్దు వ్యర్థమే అనుకుంటే వాటిని కాల్చి బూడిద చేయకుండా పంట పొలంలో కలియదున్నడం ద్వార భూసారం పెరుగుతుంది..వ్యర్థాలను సద్వినియోగం చేసుకోకుండా కాల్చిబూడిద చేయడం ద్వార భూతాపం పెంచినట్లు అవతుంది. వ్యర్థాలను కాల్చడం ద్వార భూమి వేడెక్కి భూమి తేమను గ్రహించే శక్తి క్రమేపి తగ్గుతూ గుళ్లబారే సహజ స్థితిని కోల్పోతుంది. ఫలితంగా పంటల సాగుకు పనికి రాకుండా వ్యవసాయ భూములు సహజగుణాన్ని కోల్పోవల్సి వస్తోంది. అంతే కాకుండా పంట పొలంలో వర్థాలను కాల్చేక్రమంలో మంటలు రాజేయడం ద్వార వెలువడే పొగతో వాతావరణ, వాయు కాలుష్యం ఏర్పడుతుంది. గతంలో ఊరికి దూరంగా ఉండే గుట్టలు, చెట్లు స్పష్టంగా కన్పించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. అతి తక్కువ దూరంలో ఉండే వాటిని కూడా స్పష్టంగా గుర్తించ లేకపోతున్నాము. అనుకున్న మిగితా వ్యర్థం కాల్చడంతో నైట్రస్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ నష్టపోయే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పంట పొలంలో మొక్కకు భూమి ద్వార సమకూరే కార్బన్, నత్రజని నిష్పత్తి వ్యర్థాలను కాల్చడం ద్వార నష్టపోవల్సి వస్తోంది. దీనికి తోడు భూమి పొరల్లో పంటలకు ఉపకరించే కోటానుకోట్ల బ్యాక్టీరియా ఫంగస్ వంటి సూక్ష్మజీవులను వ్యర్థాలను కాల్చడం ద్వార నష్టపోతారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వార పరోక్షంగా మరో ప్రమాదం పొంచివున్నదనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ వరి పంట చలికాలంలో చేతికి అందుతుంది. రబీ పంట సాగు చేయడం కోసం వెంటనే వ్యర్థాలను కాల్చడం సహజం. అక్టోబర్, సెప్టెంబర్ నెలలో మంచు కురుస్తుంది. అప్పుడే ఖరీఫ్ పంట కాలం పూర్తవుతుంది. ఒక వైపు వ్యర్థాలను కాల్చడం మరో వైపు మంచు కురువడం ఫలితంగా పొగమంచు ఏర్పడి పొగమంచును పీల్చిన పశువులతో మనుషులకు కూడా అనారోగ్యం తెచ్చిపెడుతుంది. ఈ విధంగా పంట వ్యర్థాలను కాల్చడం ద్వార ఏర్పడే అనార్థలను రైతులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యర్థాలు అనుకునేవాటితో ఉపయోగాలు

ముత్యం తిరుపతి (ఏఈఓ) పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థి



ధాన్యం తప్పా మిగితావన్నీ వ్యర్థాలే అనుకున్నప్పుడు వరి గడ్డి పశుగ్రాసంగా వద్దనుకుంటే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు ముడి సరుకుగా సమకూర్చి నగదుగా ఆర్థికంగా లాభం పొందవచ్చు. అదేవిధంగా ఇథనాల్ తయారిలో వరి గడ్డి ఉపయోగించవచ్చు. నివాసగృహాల్లో వినియోగించు టైయిల్స్ తయారిలో కూడా వరి గడ్డి అవసరమవుతుంది. పంటల వ్యర్థాలను కాల్చకుండా పంట పొలంలో కలిసిపోయే విధంగా దున్నుకోవడం ద్వార భూసారం పెరడంతో పాటు పంటల సాగుకు ప్రధానం అయినటువంటి సేంద్రియ కర్బన్ వృద్ధి చెందుతుంది. దున్నకుండా నిల్వ చేసుకోవడం ద్వార కాంపోస్టుగా సాగు చేసిన పంటలకు వినియోగించవచ్చు.

పంట వ్యర్థాలను ఎందుకు కాల్చాల్సివస్తోంది..?

రోండ్ల సాయికుమార్ భూవిజ్ఞాన శాస్త్రవేత్త



గతంలో ఒకటి రెండు పంటలు పండించే వారు.. ఇప్పుడు రెండు మూడు పంటలు పండించడం కోసం రైతులు ఆరాటపడుతున్నారు. ప్రధానంగా హరిత విప్లవం మొదలైనప్పటి నుండి దేశవ్యాప్తంగా చూస్తే 1960-70 నుంచి ఈ ప్రక్రియ మొదలైందని చెప్పవచ్చు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యం పండించడం కోసం పంటల కాల పరిమితి తగ్గించే నూతన వంగడాలను పరిచయం చేసుకోవడం జరిగింది. ఫలితంగా నిఖర ఉత్పత్తులను పెంచుకోవడం కోసం పంటల కాల వ్యవధి తగ్గి తదుపరి పంటలు సాగు కోసం ధాన్యం తప్పా మిగితాది వ్యర్థంగా కాల్చడం మొదలైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యర్థాలను కాల్చడం ద్వార ఏర్పడుతున్న వాతావరణ కాలుష్యాన్ని నివారించడం కోసం బాధ్యులైన వారికి ఐపీసీ 188 ప్రకారం 5 సంవత్సరాల కాలం జైలు శిక్ష లేదా రూ.కోటి జరిమాన విధించే అవకాశం ఉన్నట్లు సుప్రీకోర్టు అభిప్రాయపడింది. అదేవిధంగా 2013లో వ్యవసాయ వర్థాలను కాల్చవద్దని పంజాబ్‌లో నిషేదించారు. 2015లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వరి కొయ్యలు, వరి గడ్డి కాల్చడాన్ని నిశేదించిన తీరును బట్టి వ్యవసాయ వర్థాలను కాల్చడం ద్వార మానవాళికి జరిగే నష్టాన్ని గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేలాల మల్లన్న హుండీ లెక్కింపు

- గట్టుమల్లన్నకు రూ. 18.45 లక్షలు
- మల్లిఖార్జున స్వామికి రూ.35.28 లక్షల ఆదాయం



నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాల గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతర ద్వార వేలాల గట్టుమల్లన్న, మల్లిఖార్జునస్వామికి భక్తులు నగదుతో పాటు వెండి బంగారం కానుకలుగా సమర్పించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శ్రీరాంపూర్ సీఐ బన్సీలాల్ పర్యవేక్షణలో స్థానిక ఎస్సై ఉపేందర్‌తో కలిసి హూండీ లెక్కించారు. గట్టుమల్లన్న ఆలయానికి సంబంధించి హూండీ ద్వార రూ. 11,27,199, లడ్డు ప్రసాదం ద్వార రూ.1.75 లక్షలు, కొబ్బరికాయల విక్రయాల ద్వార రూ. 97,700, ప్రత్యేక దర్శనాల ద్వార రూ.4,14,300, కేశఖండనం ద్వార రూ.21,600 మొత్తం గట్టుమల్లన్న ఆధాయం రూ.18,45,799 సమకూరినట్లు ఈఓ రమేశ్ తెలిపారు. అదేవిధంగా 830 మిల్లీ గ్రాముల మిశ్రమ బంగారం, కిలో 1.935 గ్రాముల మిశ్రమ వెండి సమకూరినట్లు తెలిపారు.

వేలాల మల్లిఖార్జున స్వామి ఆదాయం

వేలాల గ్రామంలో గల మల్లిఖార్జునస్వామికి ఈ ఏడాది సమకూరిన ఆధాయం మొత్తం రూ. 35 లక్షల, 22 వేల, 056 నగదుతో పాటు మిశ్రమ బంగారం 592 మిల్లీ గ్రాములు, 2.316 కిలో గ్రాముల మిశ్రమ వెండి కానుకల రూపంలో భక్తులు సమర్పించినట్లు తెలిపారు. ఇందులో లడ్డు ప్రసాదం విక్రయం ద్వార రూ.3 లక్షల 78 వేలు, కొబ్బరి కాయల విక్రయం ద్వార రూ.20 వేలు, పట్నాల ద్వారా రూ.3,24,150, ప్రత్యేక దర్శనాల ద్వార రూ. 3,25,450, కేశఖండనం ద్వార రూ.20 వేలు, హూండీ ద్వార రూ.19 లక్షల 32 వేల 456 నగదుగా భక్తులు సమకూర్చినట్లు తెలిపారు.

జిరాక్స్, ఆన్‌లైన్ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-వేమనపల్లి

మండలం జిరాక్స్, ఆన్‌లైన్ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కీర్తి రవి, ఉపాధ్యక్షులుగా మానేపల్లి సుగుణాకర్, ప్రధాన కార్యదర్శి ఒడిల ప్రభుదాస్, సంయుక్త కార్యదర్శి సేని నారాయణ, కోశాధికారి కొట్ల హన్మంతు, కార్యవర్గ సభ్యులుగా కొండగొర్ల తిరుపతి, కొత్తవల్ల ప్రవీణ్ కుమార్, ఏలేశ్వరం శేఖర్, చౌదరి వెంకటేష్ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కీర్తి రవి మాట్లాడుతూ మండలంలో ఆన్‌లైన్ సర్వీసులు, జిరాక్స్ కేంద్రాలు కలిగిన వారు అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకోవాలని తెలిపారు.

కాంగ్రెస్ అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత

- కబ్రస్థాన్‌లో ముస్లీం కుటుంబాల శ్రమదానం

నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధితోపాటు అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యతనిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్ ఫయాజొద్దీన్ అన్నారు. ఆదివారం ముస్లీం కుటుంబాలు ఇందారం గ్రామ పంచాయతీ శివారులోని ఖబరస్తాన్‌లో శ్రమదానం చేశారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు, యువకుల అభ్యర్థన మేరకు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి స్థానిక సమస్యలు తీసుకుపోయారు. స్వచ్ఛందంగా శ్రమదానం చేసిన మత పెద్దలు ఖబరస్తాన్ చుట్టు ప్రహరి ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటుకు తమవంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. అభివృద్ధిని కాంక్షించే ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హిందు దేవాలయాలతో పాటు మజీద్‌ల అభివృద్ధికి కృషి చేస్తారన్న నమ్మకం ఉన్నదని తెలిపారు. ఖబరస్థాన్ శుభ్రపర్చిన వారిలో మజీద్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ తాజుద్దీన్, ఎండీ యూసూఫ్, ఎండీ ఖమ్రోద్దీన్, ఎండీ అమీరొద్దీన్, ముస్లీ కుటుంబ పెద్దలు యువకులు అబ్దుల్ వాహెబ్, లతీఫ్, రఫీ, మూవీస్, గయాస్, మోబీన్, సద్దాం, హబీబ్, నిజాం, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ద్వారకాపురం గ్రామంలో ఆదివారం బోయపల్లి ఎంపీటీసీ మాసాడి శ్రీదేవి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్వారకాపూర్ గ్రామ అభివృద్ధికి తాను అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కాసిపేట పిడబ్ల్యూ రోడ్డు నుంచి ద్వారకాపూర్ వరకు సింగరేణి నిధుల నుంచి బిటీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ద్వారకాపూర్ నుంచి కత్తర్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సిరంగి శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిట్ట శ్రీనివాస్, మాసాడి తిరుపతి, ఎల్లాకుల సురేష్, ఇందూరి సాంబయ్య పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తా

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-లక్షెట్టిపేట



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటానని, మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాననిఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఆదివారం లక్షెట్టిపేట పట్టణంలోని కళాశాల గ్రౌండ్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్షెట్టిపేట మున్సిపాలిటీలో అమృత్ నీటి సరఫరా పైప్ లైన్స్, వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.20 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా 56 లక్షలతో సిసి రోడ్స్, డ్రైనేజ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. గతంలో నేను చదువుకున్న పాఠశాల భవనం పూర్తిగా కాలిపోవడంతో ప్రత్యేక చొరవతో ఐదున్నరకోట్లతో పాఠశాల, కళాశాల భవనానికి త్వరలో టెండర్లు పిలవడం జరుగుతుందని పేర్కొన్నారు. తను చదువుకున్న పాఠశాల భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. గత పది సంవత్సరాలుగా అన్ని విధాలుగా మంచిర్యాల నియోజకవర్గం వెనుకబడిపోయిందని అన్నారు. రాబోయే రెండు లేదా మూడు సంవత్సరాల లోగా మంచిర్యాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్ వన్‌గా ఉంచుతానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలు అన్ని అతి త్వరలోనే అమలు అవుతాయని, కొంత సమయం పడుతుందని, ఓపిక పట్టాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్నికల హామీలు వర్తిస్తాయని, ఎవరు ఎలాంటి అపోహలకు వెళ్లకుండా రాబోయే ఎంపీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అభివృద్ధి విషయంలో నేను మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీకి రూ.20 కోట్లతో ఇంత తక్కువ సమయంలో తాగునీటి వసతి కల్పించడం చాలా సంతోషం అని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తూ ముందుకు సాగుతామని, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినందుకు ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, మండల పరిషత్ అధ్యక్షురాలు అన్నం మంగ-చిన్నన్న, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, పట్టణ అధ్యక్షులు ఆరిఫ్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ షాహిద్ అలీ, బాణాల రమేష్, హాజీ, అమీర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష



నవతెలంగాణ-తాండూర్

అదిలాబాద్ రీజియన్‌లోని 3 పరీక్షా కేంద్రాల్లో 6వ తరగతికి 438 మంది, ఇంటర్మీడియట్‌కు 405 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. రెండు తరగతులకు కలిపి 843 మందికి గాను 781 మంది పరీక్ష రాయగా 62 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. అలాగే 92.65 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఆదిలాబాద్ రీజియన్ సంక్షేమ గురుకులాల ఆర్సీఓ కొప్పుల స్వరూప రాణి తెలిపారు. బెల్లంపల్లిలో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులుతో కలిసి సెట్‌కు సంబంధించిన పలు వివరాలను వెల్లడించారు. బెల్లంపల్లి సీఓఈ బాయ్స్‌లో 6వ తరగతిలో 227 మందికి గాను 215 మంది హాజరవగా 12 మంది గైర్హాజరయినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో 231 మందికి గాను 216 మంది హాజరవగా 15 మంది గైర్హాజరయ్యారు.

సింగరేణి ఉద్యోగులకు పెరగనున్న పెన్షన్

- నోటిఫికేషన్ విడుదల చేసిన బొగ్గు మంత్రిత్వశాఖ

నవతెలంగాణ-జైపూర్

కోల్ మైన్స్ పెన్షన్ స్కీం 1998 సవరించడం ద్వార బొగ్గు గనుల ఉద్యోగుల కనీస పెన్షన్ పెరుగనుంది. ఈ మేరకు బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ నెల 8న గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినందున పెన్షన్ పెంపు ప్రక్రియ వెనువెంటనే అమలు కానుంది. ఇప్పటి వరకు రూ.500 లోపు పెన్షన్ పొందుతున్న వారు ఈ పెన్షన్ స్కీం 1998 సవరింపుతో నెల ఒకంటికి రూ.1000 చొప్పున పెన్షన్ పొందనున్నారు. ఈ ప్రక్రియ ద్వార బొగ్గు గనులకు సంబంధించి ఒక లక్ష ఇరువై వేల మంది పెన్షన్ దారులకు ఆర్థికంగా లాభం చేకూరనుంది.

బాలబాలికల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- ఎస్టీపీపీ ఎగ్జిగ్యూటీవ్ డైరెక్టర్ బసివి రెడ్డి

నవతెలంగాణ-జైపూర్

బాలబాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఎగ్జిగ్యూటీవ్ డైరెక్టర్(ఈడీ) బసివి రెడ్డి అన్నారు. ఆదివారం జైపూర్ ఎస్టీపీపీలో గల బ్యాచిలర్ ట్రైనీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరంలో 18 సంవత్సరాల వయస్సు లోబడిన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన అవనీ పిల్లల ఆస్పత్రి వైద్యులు రుద్రబట్ల రఘువంశీ, ముద్ర మల్టీ స్పెషల్ డెంటల్ కేర్ వైద్యులు విజయ్ కుమార్ వైద్య పరిక్షలు నిర్వహించారు. ఎస్టీపీపీ పరిధిలో గల 60 మందికి వైద్య పరిక్షలు నిర్వహించిన వైద్యులు రఘువంశీ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లల నుంచి మొదలు 18 సంవత్సరాల వయస్సు గల వారికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వైద్య సేవలు అందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవాని బసివి రెడ్డి, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేష్ పర్మార్, ఎస్ఓటు జీఎం వెంకటయ్య, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రీ, డాక్టర్ రవీందర్ పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దాం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

సావిత్రిబాయి పూలే ఆశయాలను నిరంతరం కొనసాగించాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ అధ్యక్షుడు తోగరు రాజు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఇటిక్యాలలోని 3వ వార్డులో సావిత్రిబాయి పూలే 127వ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భారతదేశంలోనే మొట్టమొదటి సారి బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు చదువు నేర్పిన మహిళా ఉపాధ్యాయురాలని ఆమె సేవలను కొనియాడారు. ఆమె జయంతి, వర్ధంతిని ప్రభుత్వాలే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కండే మొగిలి, పెండం అశోక్, నిరటి మొగిలి, ప్రియాంక, అర్పిత, ఆశాది శర్వాన్ పాల్, దిలీప్ పాల్గొన్నారు. అదేవిదంగా రంగంపేట గ్రామంలోని అంబేద్కర్ వారసుల కాలనీలో సావిత్రిబాయి పులే వర్ధంతిని స్థానికులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిప్పకుర్తి నారాయణ, మండల నాయకులు తోటపల్లి మహేందర్, మండల కో అప్షన్ సభ్యుడు ఎండీ.సలీం, నాయకులు తోటపల్లి సతీష్, చొప్పదండి మనోహర్, ప్రశాంత్, ముక్కెర సతీష్ పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని దేవాపూర్ నాయకపుగూడలో ఆదివాసీ నాయక్పోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, మండల అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, చిప్పకుర్తి బాపు, రాజు పాలేకర్ పాల్గొన్నారు.

సోమగూడెం క్రీడా మైదానంలో

సోమగూడెం భరత్ కాలనీ శిశు మందిర్ క్రీడా మైదానంలో వాటర్స్, క్రీడాకారుల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంకె రవి, వేముల కృష్ణ, బోగె పోశం, బోగె రామకృష్ణ, జిల్లాల రాజేందర్, మహేందర్, సామల శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, జైన శ్రీనివాస్, చిలుముల శంకర్, బానేశ్, అలుగం సురేశ్, వెంకటి పాల్గొన్నారు.



కాసిపేటలో..

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఆదిలాబాద్
సోమవారం | మార్చి 11, 2024 | www.navatelangana.com

సొంత ఖర్చులతో ప్రాణాలు కాపాడిన వైద్యుడు



నవతెలంగాణ-ఉట్నూర్

బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధ పడుతున్న గీత(42) మహిళను నిమ్స్ న్యూరోసర్జన్ డా.జాదవ్ నితిన్ కుమార్ సొంత ఖర్చులతో ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. నార్నూర్ మండలం భీంపూర్ గ్రామానికి చెందిన జాదవ్ గుణవంత్ రావు, సునీత దంపతుల కుమారుడు డాక్టర్ జాదవ్ నితిన్ కుమార్ నిమ్స్ హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయనను పాత ఉట్నూర్ గ్రామ ప్రజలు శాలువాతో సత్కారించి, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆత్రం లక్ష్మణ్, దేవరీ మాడావి లక్ష్మణ్, కుర్సెంగా మోతిరామ్, తుంరం మల్లకు ఉన్నారు.

మారెమ్మ ఆలయంలో దొంగతనం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పట్టణంలోని శివాజీచౌక్‌లోని మారెమ్మ ఆలయంలో దొంగతనం జరిగింది. శనివారం రాత్రి మారెమ్మ ఆలయంలో గుర్తు తెలియని దొంగలు గెట్లు పగలకొట్టి హుండీలోని దాదాపు రూ.50 వేలు, అర తులం బంగారు ఆభరణాలను ఎత్తికెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయ కమిటీ అధ్యక్షుడు బాదన్ గంగన్న ఆలయానికి వచ్చి చూడగా దొంగతనం జరిగినట్లు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడి చేరుకొని విచారణ చేపట్టారు. ఆలయం పక్కనే ఉన్న పాన్ షాపుకు ఉన్న రాడ్డును తీసి తాళం పగలగొట్టినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బాదన్ గంగన్న మాట్లాడుతూ ఆలయ హుండిలోని రూ.40 నుంచి రూ.50 వేల వరకు నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు దొంగలించినట్లు తెలిపారు. రద్దీ ప్రాంతంలో దొంగతనం జరిగిందని, పోలీసులు గస్తీ పెంచాలని కోరారు. దొంగలను త్వరగా పట్టుకోవాలని ఆయన కోరారు.

అందని వేతనాలు ఇబ్బందుల్లో ఉపాధిహామీ ఉద్యోగులు



నవతెలంగాణ-నార్నూర్

గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పిస్తూ, సకాలంలో కూలీ డబ్బులు చెల్లింపులు చేస్తున్నా ఉపాధి ఉద్యోగులకు మాత్రం నెలనెల వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎంజీఎస్ఆర్ఈజీఎస్‌లో పనిచేసే ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు ఉద్యోగ సిబ్బంది వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు మూడు నెలల వేతనాలు అందక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. కూలీలకు నిత్యం పనులు కల్పిస్తూ, వారికి సరైన సమయంలో డబ్బులు అందించేందుకు కృషి చేస్తున్న తమకు సకాలంలో వేతనాలు అందక అవస్థలు పడుతున్నామని వారు వాపోతున్నారు. వీరితో పాటు కార్యాలయంలో పనిచేసే పొరుగు సేవల కింద పనులు చేస్తున్న అటెండర్లకు సైతం వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతి నెల 10వ తేదీలోపు ఖాతాలో వేతనాలు జమ అయ్యేవి. అయితే గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు మూడు నెలలుగా ఉద్యోగ ఉపాధి, సిబ్బందికి వేతనాలు విడుదల కాలేదు. దీనితో వారు కుటుంబ పోషణకు భారంగా మారిందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ఉపాధిహామీ ఉద్యోగ సిబ్బంది ఖాతాలో వేతనాలు జమచేసి తమ ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

త్వరలో వేతనాలు అందించేందుకు కృషి : డీఆర్డీఓ సాయన్న

ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి, మూడు నెలల నుంచి వేతనాలు పడని మాట వాస్తవమే. రాష్ట్ర వ్యాప్తంగా బడ్జెట్ కేటాయింపుల్లో ఆలస్యం జరిగింది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలో వేతనాలు విడుదల అవుతాయి.

టీజీటీ ఉద్యోగం సాధించిన వారికి సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన టీజీటీ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన గంపల మహేష్, తాంసి మండల కేంద్రానికి చెందిన శాంతపూరి శ్రీకాంత్‌లను ఆదివారం మండల కేంద్రంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కష్టపడి చదివితే ఎదైన సాధించవచ్చని వీరు నిరూపించారని అన్నారు. నిరుద్యోగ యువత వీరిని ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో అద్యక్షులు గూకుంటి క్రాంతికుమార్, ముల్కాల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి నిమ్మల గజానంద్, ఆర్థిక కార్యదర్శి మగ్గిడి ప్రకాష్, సంయుక్త కార్యదర్శి బోనాల రమేష్, ఉపాధ్యక్షులు మేకల దత్తు, రమాకాంత్, ముఖ్య సలహాదారులు నేతుల గంగన్న, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని పరిగణలోకి తీసుకోకుండా క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ కిసాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అంకాపూర్‌లో గత కొద్ది రోజులుగా జరుగుతున్న వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడల్లో గెలుపు ఓటములు సహజమనే విషయాన్ని క్రీడాకారులు తెలుసుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ క్రీడాకారులు ఎంతో ప్రతిభ ఉన్న వారికి అవకాశాలు, ఆదరణ లేక ముఖ్యంగా గుర్తింపు నోచుకోక జిల్లా, రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయికి వెళ్లలేకపోతున్నారని అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామీణ స్థాయి క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తెలిపారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులు క్రీడలతోపాటు చదువుల్లో రాణించాలని సూచించారు. ఈ క్రీడల్లో భాగంగా చిన్న మాలేబోరిగాం జట్టుకు కబడ్డీ ఫస్ట్ ప్రైజ్, టెక్డి గూడా గ్రామ జట్టుకు రెండో ప్రైజ్, వాలీబాల్ ఫస్ట్ ప్రైజ్ మత్తడిగూడ గ్రామం, రెండో ప్రైజ్ తలమడుగు మండలం పల్లి(కె) జట్టు గెలుచుకున్నట్లు వారు వెల్లడించారు. ఇందులో కబడ్డీ ఫస్ట్ ప్రైజ్ శ్రీకాంత్ రెడ్డి, వాలీబాల్ ఫస్ట్ ప్రైజ్ కూనింటి దామోదర్‌రెడ్డిలు అందజేశారు. ఇందులో అట్ల గోవర్ధన్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధర్మపురి చంద్రశేఖర్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రూపేష్‌రెడ్డి నాయకులు ప్రభాకర్, నాగరాజు, ఎస్టీ సెల్ జిల్లా చైర్మెన్ ఆనంద్‌రావు, గ్రామ పటేల్ పవన్ పటేల్, మాజీ ఉప సర్పంచ్ కేశవ్ పాల్గొన్నారు.

కార్మికులకు బయోమెట్రిక్ ఇబ్బందులు

- ప్రభుత్వ ఫలాలకు దూరం
- మీ సేవల్లో పట్టించుకోని వైనం
- భవన నిర్మాణ కార్మికులకు ఆన్‌లైన్ కష్టాలు
- బయోమెట్రిక్‌కు ప్రత్యామ్నాయం చూపాలి : సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరంతరం శ్రమిస్తూ భవనాల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం వివిధ రకాల పథకాలు అందిస్తుంది. కానీ జిల్లాలోని కార్మికులు తమ గుర్తింపు కార్డులు రెన్యువల్ కాపోవడంలో ఇబ్బందులు కలుగుతుండడంతో వాటికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

కార్మికులకు బయోమెట్రిక్ ఇబ్బందులు

జిల్లాలో 15వేల మందికి భవన నిర్మాణ కార్మికుల గుర్తింపు కార్డులు ఉన్నాయి. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వీరు రెన్యువల్ చేసుకోవడంతో పాటు కొత్తవారు కూడా కార్డులు తీసుకుంటూ ఉంటారు. అయితే గతంలో ఆధార్ కార్డుతో రెన్యువల్ నూతన కార్డుల జారీ ప్రక్రియ కొనసాగేది. ప్రస్తుతం ప్రభుత్వం దీనికి బయోమెట్రిక్ లింక్ పెట్టడంతో కొత్త ఇబ్బందులు తలెత్తాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు సిమెంట్ పనిచేయడంతో వేలిముద్రలు సరిగ్గా పడక బయోమెట్రిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఫలాలకు దూరం

భవన నిర్మాణ కార్మిక శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి సాధారణ మరణానికి, తమ ఇంట్లో పిల్లల పెళ్లిళ్లకు, డెలివరీలకు రూ.30 వేల చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. ఒకవేళ ప్రమాదంలో మరణిస్తే రూ.6 లక్షల 30 వేలు కుటుంబ సభ్యులకు అందజేస్తారు. ప్రస్తుతం కార్డులు రెన్యువల్ కాకపోవడంతో వీటన్నింటికీ దూరమయ్యే పరిస్థితి దాపరించింది. అధికారులకు సమస్యలను విన్నవించిన ఎలాంటి ఫలితం లేకుండా పోతుందని ఆరోపిస్తున్నారు.

మీ సేవల్లో పట్టించుకోని వైనం

మీసేవ కేంద్రాల ద్వారా కొత్త కార్డులు తీసుకోవడం, రెన్యువల్ చేసుకోవడం లాంటివి ఉంటాయి. అయితే ఇదంతా మీ సేవలో జరగాల్సిన ప్రక్రియ. ఈ ప్రక్రియ అంత పూర్తి కావడానికి కనీసం రెండు గంటలు పడుతుంది. మీ సేవలు వివిధ రకాల పనులతో బీజీగా ఉండడంతో కార్మికులకు కార్డులు ఆన్‌లైన్ చేయడానికి విముఖత చూపుతున్నాయి. దీనితో కార్డులు రెన్యువల్ కావడం లేదు. కూలీలు వదులుకొని గంటల తరబడి నిలబడిన పనులు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన ఆన్‌లైన్ కష్టాల గురించి వివరిస్తూ గత కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందజేసినప్పటికీ మీ సేవల్లో పరిస్థితి మారడం లేదు. మీసేవ జిల్లా అధికారి దృష్టికి కార్మికుల సమస్యలు తీసుకవెళ్లిన సమస్య మాత్రం పరిష్కరం కాలేదు. నోటిమాట ద్వారా చర్యలు తీసుకుంటానని తెలిపాడని, అలా కాకుండా వారికి తప్పనిసరిగా కార్మికుల కార్డులు రెన్యువల్ చేయాలని ఉత్తర్వులు విడుదల చేయాలని కోరుతున్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు(ఫైల్)

భర్త మరణం డబ్బులు రాలేదు

భాగ్యలక్ష్మి, స్థానికురాలు



నా కార్డు రెన్యువల్ కాకపోవడంతో భర్త మరణానికి సంబంధించి రావాల్సిన రూ.30 వేలు రెండు నెలలు గడిచినప్పటికీ ఇంకా రావడం లేదు. అధికారులు స్పందించి నా సమస్య పరిష్కరించాలి. ఈ విషయం అధికారులకు విన్నవించిన స్పందన రావడం లేదు.

కార్మికుల కష్టాలు పరిష్కరించాలి

రాజేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు.



భవన నిర్మాణ కార్మికుల కష్టాలు ఉన్నతాధికారులు పరిష్కరించాలి. బయోమెట్రిక్‌తో కలుగుతున్న ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. అప్పుడే జారీ ప్రక్రియ వేగవంతం అవుతుంది. సిమెంట్ పనుల కారణంగా వేలి ముద్రాలు రావు. అధికారులు బయోట్రిక్‌కు ప్రత్యామ్నం చూపించాలి.

మీ సేవలకు ఉత్తర్వులు విడుదల చేయాలి

బాలకిషన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు.



భవన నిర్మాణ కార్మిక సంఘానికి సంబంధించిన కార్డుల రెన్యువల్, కొత్త కార్డుల జారీకి సంబంధించి మీ సేవలు తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు విడుదల చేయాలి. అప్పుడే కార్మికుల కష్టాలు తీరుతాయి. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కూడా కేంద్రాల వారు పట్టించుకోవడం లేదు. అధికారులు ఉత్తర్వులు జారీ చేస్తే కార్మికుల సమస్యలు తీరుతాయి.

అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయా

తాటిపల్లి అరుణ, కార్మికురాలు.



కార్డు కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్తే వాళ్ళు పట్టించుకోవడం లేదు. అధికారుల దగ్గరికి వెళ్లినప్పటికి కూడా ఫలితం లేకుండా పోయింది. నా భర్తకు సంబంధించిన డబ్బులు రావాలి అలాగే నా కూతురు వివాహం చేయడానికి సిద్ధమవుతున్నాను. రెన్యువల్ అయితే అవి కూడా కొంత అమౌంట్ వస్తే నాకు చేయూత కలుగుతుంది. అధికారులు పట్టించుకోవాలి.

సావిత్రీబాయి పూలే అడుగుజాడల్లో నడవాలి



కౌటల



జన్నారం

నవతెలంగాణ-కౌటాల

సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో నడవాలని మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆడె వసంత్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మాలీ సంఘం భవనంలో జ్ఞానజ్యోతి సావిత్రీబాయి పూలే 127వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, చదువుల తల్లి సావిత్రీబాయి పూలే అని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించి ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలన్నారు. వెనుకబడిన మాలీ కులస్తులు అభివృద్ధి చెందాలంటే మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. ఈరోజు మహిళలు సమాజంలో పురుషులతో సమానంగా ముందుకెళ్తున్నారంటే అది సావిత్రీబాయి పూలే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం మండల అధ్యక్షుడు నికోడె గంగారాం, మాలీ కులస్తులు వడాయి ప్రసాద్, మోర్లె పాండురంగ్, నారాయణ, వడాయి వెంకటి, లెండుగురె శంకర్, భీంరావు పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్‌లో సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను ఆదివారం అంబేద్కర్ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రోషన్, విఠల్, బౌద్ధ మహాసభ అధ్యక్షుడు గెడం ఉప్రె, అశోక్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్ : నేటి సమాజంలో మహిళలు యువతులు సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ బీఆర్ఎస్ సీనియర్ జిల్లా నాయకులు యూనిస్ అక్బాని అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో సావిత్రి బాయి పూలే వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడే, ఎంపీటీసీ పరమేశ్వర్, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, దేవరావ్ లోకండే, బాలాజీ కాంబ్లే, రాథోడ్ దత్తారాం, దుర్గే రుక్మ బాయి, చంద్రశేఖర్ లోఖండే, దుర్గే గుణవంత్ రావ్, కోర్రల మహేందర్ పాల్గొన్నారు.

జన్నారం : సమాజంలో చైతన్యం తీసుకువచ్చిన వ్యక్తి సావిత్రిబాయి పూలే అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని సుందరయ్య నగర్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కూకటికారి బుచ్చయ్య, కొండ గొర్ల లింగన్న, జయక్క, రాజన్న, మల్లేష్ నరసయ్య, గుడ్ల రాజన్న పాల్గొన్నారు.

వేమనపల్లి : మండలంలోని సుంపుటం గ్రామంలో ఆదివారం సంఘ సంస్కర్త, ఉపాధ్యాయని, రచయిత్రి, సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి, పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దూర్కే మోహన్ మాట్లాడుతూ మహిళలు విద్య, ఉద్యోగం, సామాజిక, రాజకీయాలలో ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కుబిడే వెంకటేశం, మాజీ సర్పంచ్ కొండ గొర్ల బాపు, కేవీపీఎస్ మండల కన్వీనర్ కామెర సంజీవ్, వెంకటేష్, గోపాల్, శేఖర్, దుర్గం మదనయ్య రాజమల్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నార్నూర్



వేమనపల్లి

రోడ్డు పనులకు భూమిపూజ



నవతెలంగాణ-బేల

మండలంలోని కాప్సీ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు ఆదివారం మాజీ జడ్పీటీసీ సభ్యులు రాందాస్ నాక్లే, కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని, పేదలకు అన్ని రకాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఉచిత కరెంట్, గ్యాస్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఆరోగ్య శ్రీ వంటి వాటిని అమలులోకి తీసుకు రావడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మరిన్ని హామీలను సైతం త్వరలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండావార్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు వామన్, ప్రకాష్ భోయర్, అవినాష్ భేదొడ్కర్, మడావి చంద్ర కాంత్, గేడం ఉద్ధవ్ పాల్గొన్నారు.

నేడు ఈజ్‌గాం ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయంలో సోమవారం హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్ గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 7, 8, 9 తేదిల్లో నిర్వహించిన జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు సమర్పించిన కట్నకానుకలను లెక్కింపు చేయనున్నందున ఆలయ ధర్మకర్తలు, భక్తులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థుల క్రమశిక్షణనే అన్ని రంగాల్లో రాణిస్తుంది



నవతెలంగాణ-తలమడుగు

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివిన నాడే అన్ని రంగాల్లో రాణించవచ్చని పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు లచ్చారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1987-88 సంవత్సరంలో చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 36 సంవత్సరాల క్రితం విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు ఉపాధ్యాయులను మర్చిపోకుండా ఘనంగా సన్మానించడం గొప్ప విషయమని తెలిపారు. కొంతమంది పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల గౌరవం, మర్యాద, భయంతో ఉండేవారమన్నారు. అదేవిధంగా కొంతమంది అన్ని రంగాల్లో రాణించగా, వ్యవసాయం, కూలి, వ్యాపారం చేస్తున్నట్లు పూర్వవిద్యార్థులు తెలిపారు. గత ఉపాధ్యాయులతో ఉన్న అనుభవాలను జీవితంలో మరిచిపోలేమని విద్యార్థులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం పూర్వ గురువు లైన లచ్చారెడ్డి, లింగారెడ్డి, సంపత్ కుమార్, శ్రీనివాస్ పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, కాడే రాములు, సత్యనారాయణ, ఉత్తం, ఉశన్న, నందన్న, రవీందర్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, మధుకర్, విలాస్‌రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

అర్హులైన అందరికి ప్రభుత్వ పథకాలు అందజేయాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్

నవతెలంగాణ-రెబ్బెన

అర్హులైన అందరికి గృహజ్యోతి పథకం, ప్రభుత్వ పథకాలన్నీ అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇవ్వాలన్నారు. ప్రజా పరిపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ఎంపీడీఓ కార్యాలయంలో సరిగా అప్‌లోడ్ చేయకపోవడంతో చాలామంది లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. 30 రోజుల్లో కరెంటు బిల్లు ఇవ్వాలని, కానీ 30 రోజులు దాటిన తర్వాత బిల్లులు కొట్టడం వల్ల 200 యూనిట్ల కంటే ఎక్కువగా వస్తుందన్నారు. దీని కారణంగా లబ్ధిదారులకు పథకం వర్తింపచేయడం కుదరదన్నారు. నెల దాటిన తర్వాత కొట్టడం వల్ల లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని, ఈ విషయాన్ని సిబ్బంది గమనించి 30 రోజులలోపే కరెంటు బిల్లు ఇవ్వాలన్నారు. కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రేషన్‌కార్డు ప్రక్రియ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పది సంవత్సరాలు గడిచిన రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో రాష్ట్రంలో చాలామంది నిరుపేద కుటుంబాలు రేషన్‌కార్డు లేకుండా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్‌కార్డులను జారీ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.